BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU

మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ 20-02-2025
WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు

ఢిల్లీ గద్దెపై కొలువుదీరిన రేఖా

అట్టహాసంగా ప్రమాణస్వీకారోత్సవం.. హాజరైన ప్రముఖులు

మహా, న్యూఢిల్లీ: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖ గుప్తా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రామ్‌లీలా మైదానంలో జరిగిన ప్రమాణస్వీకారోత్సవం కార్యక్రమంలో ఆమెతోపాటు ఆరుగురు ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. ముందుగా రేఖ గుప్తాతో లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా ప్రమాణం చేయించారు. ఢిల్లీకి 9వ ముఖ్యమంత్రిగా రేఖ గుప్తా హిందీలో ప్రమాణం చేశారు. అలాగే.. పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ, మంజీందర్ సింగ్ సిర్సా, రవీంద్ర ఇంద్రరాజ్, కపిల్ మిశ్రా, ఆశిష్ సూద్, పంకజ్ సింగ్ కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరితో లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తోపాటు.. 12 రాష్ట్రాల సీఎంలు, పలువురు డిప్యూటీ సీఎంల , ఎన్డీఏ కూటమికి చెందిన పలువురు నేతలు హాజరయ్యారు.

బీజేపీ తరుపున గతంలో సుష్మా స్వరాజ్, వసుంధరా రాజే, ఉమా భారతి, ఆనందీ బెన్ పటేల్ వంటి వారు సీఎంలుగా పనిచేసారు. మొత్తంగా దేశంలో ఓ స్టాటజీ ప్రకారం మహిళా సాధికారికతకు భారతీయ జనతా పార్టీ పెద్ద పీఠ వేస్తోంది.

నాలుగో మహిళా సీఎంగా రికార్డు

రేఖా గుప్తా ఢిల్లీకి నాల్గో మహిళా ముఖ్యమంత్రి.. ఈమె మొదటిసారి శాసనసభకు ఎన్నికయ్యారు. మొత్తంగా బీజేపీ సీనియారిటీని పక్కన పెట్టి..ఓ మహిళా నేతకు ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠం అప్పగించడం వెనక పెద్ద రాజకీయమే దాగుంది. గతంలో ఢిల్లీ ముఖ్యమంత్రిగా సుష్మా స్వరాజ్ బీజేపీ తరుపున ముఖ్యమంత్రిగా అతి కొద్ది కాలం పనిచేశారు.

హత్యపై భగ్గు

లింగమూర్తి హత్యపై రాజకీయ దుమారం

- ఘటనపై రేవంత్ సర్కార్ సీరియస్
- కేసు సీబీసీఐడి కి అప్పగింత
- హత్యకు గల కారణాలపై సీఎంఓ ఆరా..
- కేటీఆర్ అండతో గండ్ర అనుచరులే
- మట్టు బెట్టారు : కుటుంబసభ్యుల ఆరోపణ

మహా, హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లిలో సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి దారుణ హత్య తీవ్ర కలకలం రేపుతోంది. మేడిగడ్డ కుంగిపోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమంటూ కేసువేసిన లింగమూర్తి హత్యకు గురవుడం రాజకీయంగా దుమారం రేపుతోంది. లింగమూర్తి హత్య ఘటనను రేవంత్ సర్కార్ సీరియస్‌గా తీసుకుంది. ఈ హత్యపై సీబీసీఐడీ చే విచారణ చేయించాలని నిర్ణయించింది. మేడిగడ్డ అవినీతిపై పోరాడుతున్నందుకే లింగమూర్తిని హత్య చేశారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన అనుచరులే రాజలింగమూర్తిని చంపారని మృతుడి భార్య, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే తన అనుచరుల ద్వారా నడిరోడ్డుపై తన భర్తను హత్య చేయించారన్న రాజలింగమూర్తి భార్య సరళ ఆరోపించారు.

కత్తులతో పొడిచి..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాజీ కాన్సిలర్ భర్త రాజలింగమూర్తి బైక్‌పై వెళ్తుండగా.. దుండగులు కత్తులతో పొడిచి హత్య చేశారు. ఐదుగురు కలిసి హత్య చేసినట్లుగా స్థానికులు చెబుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్రగాయాలతో పడిఉన్న రాజలింగమూర్తిని హుటాహుటీన అంబులెన్సులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాజలింగమూర్తి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

హంతకులను పట్టుకనే వరకు..

రాజలింగమూర్తి హత్యకు భూ వివాదమే కారణమై ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హంతకులను పట్టుకునే వరకు అంత్యక్రియలు కూడా చేయమని మృతిని భార్య, కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు. ఇదిలాఉంటే.. రాజలింగమూర్తి సామాజిక కార్యకర్తగా అనేక సమస్యలపై ఉద్యమించేవారని స్థానికులు చెబుతున్నారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి జరిగిందని గతంలో కేసీఆర్, హరీశ్ రావుతో పాటు పలువురిపై రాజలింగమూర్తి న్యాయ పోరాటం చేస్తున్నారు. భూపాలపల్లి కోర్టులో ప్రైవేటు పిటీషన్ వేశారు.

భూ వివాదమే కారణమా?.

రాజలింగమూర్తి హత్య కేసుపై విచారణ చేపట్టిన పోలీసులు.. అతని హత్యకు భూ వివాదమే కారణమని గుర్తించినట్లు తెలిసింది. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఎకరం భూమి విషయంలోరేణుకుంట్లకొమరయ్య,సంజీవ్‌తో రాజలింగమూర్తికి వివాదం ఉంది. ఈ భూమి కేసు కోర్టు పరిధిలో ఉంది. రాజలింగమూర్తికి అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చే సంకేతాలు ఉండడంతో కాపుకాసి నలుగురు దుండగులు హత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. రాజలింగమూర్తి హత్యకు సంబంధించిన కేసులో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పరారీలో ఉన్న దుండగులకోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుపై లింగమూర్తి కేసు వేశారు. ఆ ఫిర్యాదుతో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుతో పాటు ఐదుగురిపై కేసు నమోదు అయ్యింది. దీంతో పాటు భూపాలపల్లిలో వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై రాజలింగమూర్తి కేసు వేశారు.

ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ హత్యే

హరీశ్‌రావు.. నీవు మనిషివేనా?

గండ్రను పార్టీ నుంచి సస్పెండ్ చేయకుండా డ్రామాలా

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్

మహా, హైదరాబాద్: రాజలింగమూర్తి హత్యపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్ అయ్యారు. గురువారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ రాజలింగం హత్యలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, గండ్ర వెంకటరమణ రెడ్డి పాత్ర ఉందని ఆరోపించారు. 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేయాలని ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి వెంటనే శిక్ష వేయాలన్నారు. హరీశ్ రావు నీవు మనిషివేనా? నీకు మానవత్వం ఉందా అని మండిపడ్డారు. కేటీఆర్ ఆదేశాలతోనే మాజీ ఎమ్మెల్యే గండ్రా వెంకటరమణారెడ్డి నా భర్తను హత్య చేయించాడని రామలింగమూర్తి భార్య, కూతురు ఆరోపిస్తుంటే గండ్రా వెంకటరమణారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి పోలీసులకు లొంగిపోమని చెప్పకుండా హరీశ్ రావు ప్రెస్ మీట్ పెట్టి కృష్ణా వాటర్ అంటూ డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. లగచర్లలోలో కూడా కలెక్టర్ ను చంపాలని చూశారని మంత్రి ఆరోపించారు. తెలంగాణను దోచుకోవడమేకాకుండా.. ఎదురు తిరిగిన వాళ్ళను చంపేస్తారా? పాపం తగిలి పోతరు.. తెలంగాణాలో హత్య రాజకీయాలకు తావు లేదు అవినీతి మీద పోరాడే వారికి రక్షణ కల్పిస్తాం. హరీష్ రావు అవినీతి మీద పోరాడుతున్న చక్రధర్ కూడా రక్షణ కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో హత్యా రాజకీయాన్ని పెంచి పోషించిందని ధ్వజమెత్తారు.

ఏఐజీ ఆస్పత్రికి కేసీఆర్

వైద్య పరీక్షలు చేయించుకున్న మాజీ సీఎం

మహా, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ గురువారం నగరంలోని గచ్చిబౌలిలో ఉన్న ఏఐజీ ఆస్పత్రి వెళ్లారు. రెగ్యులర్ చెకప్‌లో భాగంగా కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లినట్లు బీఆర్ఎస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉంటే అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొద్ది రోజులకు తన ఫామ్ హౌస్ లో జారి పడటంతో కేసీఆర్ తుంటి ఎముక విరిగింది. దీంతో ఆయనకు డాక్టర్లు సర్జరీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలపై చర్చించేందుకు బుధవారం తెలంగాణ భవన్ కు వచ్చారు. కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి.. మళ్లీ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 100 శాతం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయని.. ఆ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు కచ్చితంగా గెలుస్తారని కార్యకర్తల్లో కేసీఆర్ ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమం అనంతరం నంది హిల్స్ లోని తన నివాసంలో పార్టీ నేతలతోనూ సమావేశం అయ్యారు.

పగటి కలలు మానుకో కేసీఆర్

- ఆయన చెబితే కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయినట్లా
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు

మహా, నిమాజాబాబాద్: టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ పనైపోయిందని, రాజకీయాల్లో కేసీఆర్ శకం ముగిసిందన్నారు. కేసీఆర్ పగటి కలలు కంటున్నారని అన్నారు. ఆయన పర్మినెంట్‌గా రెస్ట్ తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదన్నారు. కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ ఆదరించబోరని అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టే సత్తా లేని బీఆర్ఎస్.. మళ్లీ అధికారంలోకి వస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఫామ్ హౌస్‌లో పెన్ను పేపర్‌తో గీస్తే గ్రాఫ్ పడిపోతుందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 56శాతం బీసీలు మా వెంట ఉంటే గ్రాఫ్ ఎలా పడిపోతుందన్నారు. ఏడాదిలో 56 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఇకనైనా కేసీఆర్, బీఆర్ఎస్ పగటి కలలు మానుకోవాలని హితవు పలికారు. రైతులకు రుణమాఫీ సహా పలు కీలక హామీలు అమలు చేశామని.. అలాంటప్పుడు మా పార్టీ గ్రాఫ్ ఎలాపడిపోతుందన్నారు. కేసీఆర్ గ్రాఫ్ మొత్తం నేలమట్టం అయిపోయి ఫామ్ హౌస్ కే పరిమితం అయిపోయిందన్నారు. నీ అల్లుడు, బిడ్డ హరీష్ రావు, కవితలు ఇతర పార్టీల వైపు చూస్తున్న సందర్భంతో మీ పార్టీ గ్రాఫ్ ఎక్కడుందో అర్థమవుతోందని కేసీఆర్ కు చురకలంటించారు. రాబోయే కాలంలో బీఆర్ఎస్ పార్టీలో తండ్రి, కొడుకులు మాత్రమే ఉంటారన్నారు.

పెళ్లి సందడి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం తుర్కయంజాల్ లో జరిగిన వివాహ వేడుకకు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డితో సహా పలువురు నాయకులు వివాహానికి హాజరయ్యారు.